

# కోలువులు

పేతరాజుకు ఇంగ్లీషువిద్య అబ్బక వర్తక వ్యాపార రహస్యములెల్లయు అచ్చియెట్లు బాగుపడజొచ్చెనో శ్రీనివాసరావుకు వర్తకవ్యాపారులచెంత గుమాస్తాగా నిలుచు భాగ్యమైనను స్థిరకాలము నిలవక తలువని తలంపుగా ఉద్వాసన ముట్టినది. చెన్నపురి వీధులలో తిరిగీ నిరుద్యోగియై యెక్కడైనా ట్యూషనులు దొరుకుతవా, ఏ పత్రికాధిపతి ఆఫీసులోనానైనా ప్రూఫురీడరు పనియైనా దొరుకుతుందా అని తచ్చాడిపోతున్నాడు.

అదృష్టదేవత తానుగా వరించి యెవరినైనా కౌగిలించుకొన్నచో అతను ప్రజ్ఞావంతుడుగా పరిగణింపబడతాడు కాని తానుగా ఆ దౌర్భాగ్యపు రాకాసిని వెతకులాడితే మర్యాదాహీనుడై పేలవమైపోతాడు. ఎమ్మే పేసయిన ఒక పండితుడు పాతికరూపాయీల ప్రూఫురీడరు పనియైనా పదిరూపాయీల ప్రైవేటు ట్యూషనైనా యిప్పించుమని శ్రీమంతుల పంచను ప్రేలాడుచుండుటచేత, ఇతనిలో ఏ లోపము లేకుంటే యింత చౌక జీతమునకు తయారౌతాడాయని పట్టణములోని పెద్దలందరికీ సందేహ మూదయించినది. ఇతనిచేత పిల్లలకు పాఠములు చెప్పించితే వారు తప్పక ఫేలవుతారని పెద్దింటివారందరికీ సందేహము కలిగి యెవ్వరూ నియమించుకోరాయెను. ప్రూఫురీడరీకాక మరేమీ చేతకానివాడనిన్నీ; అదయినా తిన్నగా చేయలేడనిన్నీ; ఈమాత్రమునకు యెంత తక్కువ జీతమునకు వచ్చినాసరే ఎమ్మే ప్యాసవవానిని వేసుకుంటే లాభముండదనిన్నీ ఒక తత్వము మరికొందరు పెద్దలను పట్టుకున్నది. ఎక్కడకు వెళ్లినా కాస్త కుర్చీమీద కూర్చోబెట్టి నాలుగు గడియలు గౌరవముగా ప్రస్తావన చేసేవారేకాని, ఔననీ కాదనీ చెప్పే మహానీయులు లేకపోయినారు.

ఇది కాదురా అని ఒక సత్రము అరుగులమీద బిచానవేసి ఇద్దరు పేదపిల్లలకు దినమునకు రెండుగంటలు సేపు ఊరకనే పాఠములు చెప్పుచు రెండేసిరోజుల కొకొక్క మిత్రునియింట పెద్దవారియింట భోజనము చేయుచు శ్రీనివాసరావు నెలదినము లెట్లో గడపెను. ఇతని అదృష్టమువల్ల ఆపిల్లలు క్లాసులో రాణించుచు మాష్టరుగారి ప్రశ్నలకు చక్కగా జవాబులు చెప్పేవారు. వారిని మెచ్చుకొని మేష్టరులు ఇతరులకు బుద్ధిచెప్పుచు

శ్రీ పద్మనాభం

చీవాట్లుపెట్టేవారు. రాముడు వెంకటి అను యిద్దరికిని శ్రీనివాసరావు పాఠములు చెప్పుచుండెను. వారిద్దరును హిందూ హైస్కూలులో ఫస్టుఫారము చదువుచుండిరి. వారిద్దరును క్లాసుపుస్తకములు కాక యేవో చక్కని కథలపుస్తకములు క్లాసు రూములో ఒకదినము మధ్యాహ్నము ఒకటి రెండుగంటల మధ్యను శ్రద్ధగా చదువుచుండిరి.

రామారావు అను మరియొక విద్యార్థి వారివద్ద కప్పుడు తన షోకు చూపించుకొనుటకు కాబోలు వచ్చెను. కాలినిండా పంట్లము గుండెలపై వ్రేలు చెవుల షర్టుల మీద నెక్కటై. వెయిస్టుకోటు, మీద పొట్టిదొక ముఖమలుకోటు, జరీటోపీ, కోటు జేబులో ఫౌంటనుపెన్ మొదలగు లాంఛనము లన్నింటితో అతడొక జమీందారుని పుత్రునివలె కనిపించును. అతనిపేరు రంగారావు- వీరి శ్రద్ధయెడల నతని కచ్చెరువుకలిగి కాస్తసేపు నిలబడి వారు చదువుచున్న రంగురంగుల బొమ్మల పుస్తకమును చూచి యెంతకు కొన్నారని అడిగినాడు.

రాముడు:-"మేము కొనలేదు. మా మాస్టారు మా కూరకే ఇచ్చి రోజూ పాఠము చెప్పుచున్నారు. ఇందులో ఆరు పాఠములయినవి. రేపు ఏడవది ప్రారంభం."

వెంకటి:-అందుకే ముందుగా కథ చూచుకుంటున్నాము. ముందుకథ చూచుకుంటే రేపు అతను ప్రారంభించు నప్పుడు సులభంగా తెలుస్తుంది.

రావు:-ముందుగా చూచుకుంటే మీకు తెలుస్తుందా?

వెంకటి:-కొంచెము తెలుస్తుంది.

రాము:-అదేచాలు. ఎంతవరకు తెలిసిందో ముందుగా అయ్యవారు అడుగుతారు- చెప్పుతూవుంటే తప్పులు దిద్దుతారు. పిమ్మట తాను స్వయముగానే బోధిస్తారు- బాగా తెలిసిందో లేదో మళ్ళా ప్రశ్నలువేస్తారు- ఇట్లాగ రెండుగంటలు అతి చక్కగా కాలక్షేపము చేస్తారు.

రావు:-అతనికి మీరేమి జీత మిస్తారు?

రాము:-మేమిచ్చేదేమిటి? మాకేమి టున్నది? ఎవరో హరిజన సంఘంవారు జీతాలుకడితే యిక్కడ మాకు చదువు; లేకుంటే లేదు. పైగా ఆయనే మాకు పుస్తకాలు బొమ్మలు తెచ్చియిస్తారు, పాఠంకూడా చెప్పుతారు.

రావు:-ఆయనంత భాగ్యవంతుడా యేమిటి?

వెంకటి:-భాగ్యమెక్కడ? చింకిచొక్కా, కుళ్లుపంచ, పొట్టితువాలు వేసుకొని ఉదయ మొక్కనాడు సందెవేళ ఒకొక్కనాడు సత్తరవు అరుగుమీదికి షికారు వచ్చి పోతూ వుంటారు.

రావు:-మీయిద్దరికే చెప్పుతారా ఇంకెవరికైనా కూడా చెప్పుతారా?

వెంకటి:-అక్కడకువచ్చిన వారికందరికీ ఏదో ఒకటి చెప్పుతారు- పెద్దవాళ్ళకు ఏదో ప్రసంగాలు చెప్పుతారు. సందెవేళ అప్పుడప్పు డేదో ఒక కూటమవుతునే వుంటుంది.

రావు:-నాకుకూడా చెప్పుతారా, మా యింటికివచ్చి? మా ప్రాతమేష్టరుని మానిపించేయవలెనని ఉంది.

రాము:-అట్లాగ ఆయ నెవరింటికీపోరని తోస్తుంది. పేద సాదలంటేనే ఆయన కభిమానం.

రావు:-నాకు కూడా వినవాలని వుందోయి. ఎలాగాతుంది?

రాము:-మీ యిల్లెక్కడ? మావీధికి వస్తారా?

రావు:-మాయిల్లు మైలాపూరులో.

రాము:-అక్కడనుంచి దినమూ వస్తారా!

రావు:-అవును. కారులో వస్తాను మళ్లీ కారులో వెళ్తాను.

వెంక:-అబ్బో! మీరు ప్లీడరు కొడుకు కాబోలు!

రావు:-కాదు. మా కక్కడ ఒక మేడ ఉంది. కావలసిన డబ్బు బ్యాంకునుంచి తెచ్చుకుంటాము- నౌకర్లు చాకర్లంతా వున్నారు.

వెంక:-అయితే రాజులు కాబోలు! మీరు మాతో చదువుతున్నా రేమిటి?

రాము:-ఎవరైనా సరే చదువుకోవాలంటే యివేగా బడులు! ఇంతకంటె మరెక్కడైనా చదువు లెక్కువ చెప్పేస్తారా యేమిటి?

రావు:-నాలుగేళ్లుపోతే మా అమ్మగారు నన్ను లండను పంపించుతారట.

వెంక:-అయితే ఇక్కడ బాగా చదువు రావాలన్న మాట.

రావు:-అందుకే మీ మాస్టారువద్ద యిల్లాటి పుస్తకాలు నేర్చుకోవాలని వుంది.

వెంక:-మా మాస్టారుని కనుక్కొని చెప్పమన్నారా?

అని యీవిధముగా గంట కొట్టేదాకా బాతాఖానీ చేసుకున్నారు. పిమ్మట క్లాసంతా పాఠాల గొడవలో పడిపోయింది. ఈ కుర్రవాళ్లిద్దరూ నాటి సాయంకాలము ఈ ప్రసంశ సత్రం అరుగులమీద శ్రీనివాస రావువద్ద తీసుకొనివచ్చినారు. అక్కడి పెద్దలు ఆ కుర్ర వాడు కోరుకొండ రాణీ కొడుకని చెప్పినారు. మరునాడు ఒంటిగంట ప్రాంతమున శ్రీనివాసరావు స్కూలు వరి వరములలో తిరుగుచుండగా రాముడు వెంకటి యిద్దరు కలిసి రామారావును పిలిచి అతనే తమవంతు లయ్యవారని చూపించిరి. హేయమగు ఆ దరిద్రవేషమును చూచి రావు ఆశ్చర్యపోయెను. వారు ముగ్గురును శ్రీనివాసరావును కలుసుకొనిరి.

రావు:-ఏమండీ మాస్టారూ, మాకుకూడా పాఠం చెప్తారా?

శ్రీని:-మీ యిల్లెక్కడ? మీరు దినమూ యీ పేట సత్రముకు రాగలరా?

రావు:-అయ్యో బాబో! మావాళ్లు ఒప్పుకుంటారా? స్కూలు వదలితే, మరి యిల్లు కదలనీయరే. ఆటా పాటా అంతా ఆ కోటలోనే కావాలి అంటారు.

శ్రీని:-అయితే మరి యెట్లాగ అవుతుంది?

రావు:-మావాళ్లతో యీ ప్రసంగము నిన్న చేసినాను. మాష్టరు నాకు వద్దన్నాను. క్రొత్తవా రెక్కడున్నారని అడిగారు. ఉన్నారు లెండి అని చెప్పినాను. తమరు మాయింటికి రాకుంటే యెట్లాగు?

శ్రీని:-ఇక్కడనుంచి అక్కడకు నడిచిందుకు ఒక గంట అవుతుంది. కాక వీళ్లని విడచిరావడమునకు నాకు మనసు ఒప్పదు.

రావు:-మావాళ్లతో చెప్పుతా నుండండి. మీరు నాకు పాఠాలు చెప్పక తప్పదు.

శ్రీని:-సరే చూతాములే" అని చెప్పి యేదో పనిమీద పోవుచున్నవానివలె తొందరగా పారిపోయెను.

ఏలాగైతే నేమి రావువారి దేవిడీనుంచి శ్రీనివాసరావుకు పిలుపువచ్చింది. ఉదయం రాత్రివేళ పిల్లడికి పాఠములు చెప్పుటకు, భోజనముపెట్టి, బసయిచ్చి నెలకు 10 రూపాయిలు యిచ్చుటకు నిర్ణయమైనది. సగము దారిద్ర్యము నిర్మూలమైనందుకు యించుక సంతసించి ఇంటికి ఉత్తరమువ్రాసి నెలాఖరున పదిరూపాయలు మని యార్డరు కట్టాడు.

రావుకు తక్కిన జమీందారీ పిల్లలవలె కాక కాస్త చదువునందు శ్రద్ధాభక్తులు కలవు. ఆ శ్రద్ధాభక్తులు చదువుమీదనుండి కాస్త గురువుగారిమీదికి కూడా ప్రసరించటములో ఆశ్చర్యములేదు. పండు ఫలము బట్ట పాత యిచ్చుటయేకాక సినీమాలు పికార్లుకూడా అతనితోనే

చేయుచుండెడివాడు. ప్రాత సాహుకారీ బాలనాయకత్వముకంటె యిది కొంత నయముగా కనిపించినది.

క్రమముగా శ్రీనివాసరావు కుటుంబమందరికీ పరిచయ మగుటయేగాక వారి వ్యవహారములు మొదలైన వానికి సంబంధించిన కాగితములు చదువుట వ్రాయుట మొదలగు కృత్యముల కలవాటు పడినాడు. వచ్చే పోయే వారందరి దగ్గర తమ ప్రభువులు చాలా గొప్పవారు ఉదారులు, కీర్తిమంతులు, అని పొగడుతూ వుండేవాడు. వంగివంగి నడవడము, గజగజ వణకడము, చిత్త వృత్తులు కనిపెట్టడము, వారు నవ్వినప్పుడు నవ్వడము, ఆశ్చర్యపడినప్పుడు ఆశ్చర్యపడడము, ప్రభువులు దూషించినవారిని తాను దూషించడము, వారు పొగడిన కవులను గ్రంథములను ప్లీడర్లను తానును పొగడడము ఈ మొదలైన సుగుణ పుంజులన్నీ అతనికిదివరకు అభ్యాసము లేకపోయినను, కించిత్తు సహవాస దోషమువలన అతనికిని అభ్యాసమైనవి.

ఇట్టి సుగుణములు సాధారణులకు పట్టుపడడమే కష్టము; కాని పట్టుపడ్డచో మరి విడువవు. ఇవి పట్టుపడిన వారికి సాధారణముగా ఉద్యోగములోనుంచి విడుదలమరి కాదు. జీతముకూడా పదిరూపాయలకు మరి మించదు. అయితే నాటికీ నేటికీ జమీందారీ కొలువులలో ఒక సుగుణమున్నది. జీతమెంత కనీసమటకానీ, ఆశ్రితుల కష్టసుఖములను కాస్త కనిపెట్టు సుగుణ మింకను అనేక కుటుంబములలో ఉన్నది- సలాములు పెట్టి పొగడుతూ ఏడుస్తూ తమ కష్టసుఖములు చెప్పుకున్నపుడల్లా గొప్పకో గోటుకో చిన్న దగ్గరనుంచి పెద్ద దాకా యెవరి అంతస్తుకు తగినట్లు వారికి ఎంతో కొంత చెయ్యి దులుపబడు చుండును.

రాణీగారి అన్నదమ్ములు మొదలైనవారే యెన్నాళ్ళో "నాతి గల బ్రహ్మచర్య" మని అతని నాక్షేపించి, రైలు ఖర్చులిచ్చి కుటుంబమును అచ్చటికి రప్పించినాడు. వేరే చిన్న దొక అద్దెకొంప కుదుర్చుకున్నాడు. చీకటి ఉండగానే లేచి స్నానముచేసుకొని విభూది పెట్టుకొని దివాణములో హాజరవడము, ఏదో పని చేస్తున్నట్లో పురమాయిస్తున్నట్లో హడావడి చేస్తూ వుండడము, కాస్త అవకాశము దొరకగానే ప్రభువుల కిష్టమైన ప్రసంగములో ప్రసంశలో ప్రారంభించడము భోజనమునకు ఇంటికివస్తే రావడము లేకుంటే వారేది తినమంటే అది తినడము, వారందరికీ నిద్రపట్టి అర్థరాత్రివేళ తన యింటికివచ్చి తలుపుకొట్టి కుటుంబ గోష్ఠి కించిత్తు జరుపుకోవడము—ఇది అతని దినచర్య.

అయితే యీ మాత్రము కొలువులైనా యిచ్చే మహారాజు లెక్కడ ఉన్నారు ఈ కాలములో? గవర్నమెంటు కచ్చేరీలలోను వర్తకుల ఫర్మలలోను, ఎడిటర్ల ఆఫీసులోను, క్యాపిట లిలిష్టుల కొలువులలోను మాత్రము ఇంతకంటె యేమి నయముగలదు. పని పాటులా యింతకంటె యెక్కుట. బెదిరింపులకా అంతంవుండదు, డిస్మిస్సులా నోటీసు లేకుండానే. ముఖస్తుతులా ఇంతకంటె కోటిరెట్లు ఎక్కువ చేయావాలి. ఎన్ని ప్రయత్నములు చేస్తే అతని కిట్టి భాగ్యము లభించగలదు? మాలపేటలోని పాఠములు ప్రారంభించడమువల్లనే తనకీ ఫలము కలిగినదని అతనికి హరిజనులు యెడల చాలా గురి. అవకాశ మైనప్పుడల్లా ఆ పేటలోని పెద్దవారితో గోష్ఠి సలుపడము, పిల్లలను పలుకరించి నవ్వి ఆనంద పరచడము మొదలైన పనులు చేస్తూ వుంటాడు.

ఈ మహా కొలువుకోసము యెమ్మె క్రిందపెట్టిన సొమ్ము నష్టము దండగయ్యెనని అత ననుకొనుచుండును. అయితే ఆ తెలివితక్కువ తనము యెమ్మె చదవడములోనే గలదని అతని ఉద్దేశ్యము. ఇంకను తనవంటి తెలివితక్కువ వారు కోటానుకోట్లు కాలేజీలలో ఉన్నందు కతనికి మిగుల దుఃఖము కలుగుచుండును.